# ఆదివాసీలపై దాడి అమానుషం

- పేదలన్న ప్రేమ లేదు.. ఆడబిడ్డలన్న ఇంగితంలేదు
- హైదరాబాద్ మీదికే కాదు.. అడవిపైకీ బుల్డోజర్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు



హైదరాబాద్, జూన్ 23 (నమస్తేతెలంగాణ) : 'పేదలన్న ప్రేమలేదు.. ఆడబిడ్డలన్న ఇంగితంలేదు.. అందుకే రేవంత్ సర్కారు పోడు భూములు సాగు చేసి పొట్టపోసుకుంటున్న ఆదివాసీ బిడ్డలపై దాడులకు దిగింది. ఆడబిడ్డలను వివస్త్రలను చేసి కొట్టించింది' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. హైదరాబాద్ మీదికే కాదు.. అడవులపైకీ బుల్డోజర్లు పంపడం సిగ్గుచేటని సోమవారం ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 420 హామీలు అమలు చేయడం చేతగాక, హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట రాష్ట్ర రాజధానిలో పేదల ఇండ్లు కూల్చడమే పనిగా పెట్టుకున్నదని దెప్పిపొడిచారు. రోడ్ల విస్తరణ, పరిశ్రమలకు భూ సేకరణ పేరిట లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారగొండ, సిరసనగండ్లలో రైతుల పొలాలు, ఇండ్లమీదికి బుల్డోజర్లను పంపి పైశాచికానందం పొందుతున్నదని ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే, ఎదిరిస్తే, నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా కేసులు నమోదు చేస్తూ దుర్మార్గాలకు ఒడిగడుతున్నదని విమర్శించారు. 420 హామీలను పక్కకు పెట్టి కూల్చే, కాల్చే పథకాలను ముందుకు తెచ్చిందని ఎద్దేవాచేశారు.

### పై కప్పు నిర్మించలేనివారు కాళేశ్వరంపై విమర్శలా?

హైదరాబాద్‌లో రూ.430 కోట్లతో నిర్మించిన చర్లపల్లి రైల్వేస్టేషన్, ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ పైకప్పులే బీజేపీ ఇంజినీరింగ్ అద్భుతాలకు నిదర్శనమని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీజేపీ మార్క్ అభివృద్ధిని బహిర్గతం చేసేందుకు ఒక్క సాధారణ వర్షం చాలని దెప్పిపొడిచారు. నిరుడు ఢిల్లీలో కూలిపోయిన ఎయిర్‌పోర్ట్ స్లాబ్, ఇటీవల వర్షానికి అతలాకుతలమైన చర్లపల్లి రైల్వే స్టేషన్ ఫొటోలను పోస్ట్‌కు జతచేశారు. వాళ్లు నిర్మించిన పైకప్పుల గొప్పతనం గురించి చెప్పుకొనేందుకు సిగ్గుపడుతున్న బీజేపీ నాయకులు.. కాళేశ్వరంపై ఇష్టారీతిన మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. అయినా బీజేపీ తెచ్చిన షేప్ షిఫ్టర్ పైకప్పుల అద్భుతమైన కొత్త మోడల్‌ను ఏ ఏజెన్సీ పరిశీలిస్తుందోనని తాను ఆశ్చర్యపోతున్నానని పేర్కొన్నారు.



తమ భూముల్లో సాగు చేసుకునేందుకు వెళ్లిన భద్రాద్రి జిల్లా రామన్నగూడెం గిరిజనులు

# ఆ భూములను సాగుచేసుకుంటం

- భూముల స్వాధీనానికి రామన్నగూడెం గిరిజనుల యత్నం
- రెండ్రోజులు ఆగాలన్న అధికారులు

అశ్వారావుపేట రూరల్, జూన్ 23 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గిరిజనులకు జిల్లా అధికారులు ఇచ్చిన గడువు పూర్తికావడంతో సదరు భూములను స్వాధీనం చేసుకునేందుకు సోమవారం ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న అటవీ, పోలీసులు అధికారులు గిరిజనుల వద్దకు వచ్చి అదనపు కలెక్టర్ సెలవులో ఉన్నారని, మరో రెండురోజుల్లో వచ్చి భూ సమస్యను పరిష్కరిస్తారని అప్పటివరకు ఆగాలని నచ్చచెప్పారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. ఈ నెల 12న కలెక్టరేట్‌కు పాదయాత్రగా వెళ్లగా అదనపు కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు సోమవారం జాయింట్ సర్వే ప్రారంభిస్తామని చెప్పిన విషయాన్ని గిరిజనులు అధికారులకు గుర్తుచేశారు. మరో రెండ్రోజుల్లో జాయింట్ సర్వే ప్రారంభిస్తామని, ప్రశాంతంగా సమస్యను పరిష్కరించుకుందామని అటవీ అభివృద్ధి సంస్థ అధికారి చంద్రకళ చెప్పడంతో గిరిజనులు తిరిగి వెళ్లిపోయారు.





'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతున్న కోసగుంపు ఆదివాసీలు, తమపై దాడి జరిగిన అంశంపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనాన్ని చదువుతున్న కోసగుంపు ఆదివాసీలు

# జేసీబీతో తొక్కేస్తమన్నరు!

మొదటిపేజీ తరువాయి...

ఆడబిడ్డలు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నో ఏండ్లుగా సాగుచేసుకుంటున్న పోడుభూమిలో పత్తి విత్తనాలు పెడుతున్న తమ వద్దకు జేసీబీలతో ఎందుకొచ్చారంటూ అడిగినందుకు అధికారులు దాడులకు పాల్పడ్డారని, పిడిగుద్దులు గుద్దారని చెప్పారు. వాటికి తాళలేక తాము రెండు చేతులు జోడించినా, కాళ్లు మొక్కుతామంటూ ప్రాధేయపడినా వదలలేదని కంటతడి పెట్టుకున్నారు. పైగా 'జేసీబీతో వీళ్లను తొక్కేయ్' అంటూ జేసీబీ ఆపరేటర్‌ని అటవీ శాఖ అధికారులు ఆదేశించారని ఆరోపించారు. తాము తప్పించుకొని బయటకు వచ్చామని, లేదంటే అక్కడే తమను చంపేసేవాళ్లని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నెల 20న కోసగుంపులో ఆదివాసీ మహిళలపై అటవీ శాఖ అధికారులు చేసిన అమానుష దాడుల విషయంలో వాస్తవాలను తెలుసుకునేందుకు 'నమస్తే తెలంగాణ' బృందం సోమవారం ఆ గుంపునకు (కోసగుంపు) వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులంతా గ్రామ కూడలి వద్దకు కదిలి వచ్చారు. ఈ నెల 20న జరిగిన దాడి విషయాలను కండ్లకు కట్టినట్టు వివరించారు.



### బాలింతలమని కూడా చూడలే..

'కోసగుంపునకు చెందిన ఆదివాసీ మహిళలందరం కలిసి చంటిబిడ్డలను తీసుకొని సాగు చేసుకుంటున్న పోడుభూముల వద్దకు వెళ్లాం. మా భర్తలు వేరే పనులకు వెళ్లడంతో మేం వెళ్లి మా పోడు భూముల్లో పత్తి విత్తనాలు పెడుతున్నాం. ఆ రోజు ఉదయం అటవీ శాఖ అధికారులు జేసీబీ యంత్రాలతో అక్కడకు వచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల వరకూ అక్కడే ఉన్నారు. ఆ తరువాత మా వద్దకు వచ్చి విత్తనాలు వేయొద్దని అడ్డుకున్నారు. 'ఇది మేం ఏండ్లుగా సాగుచేసుకుంటున్న పోడుభూమి, కొత్తగా ఏమీ పోడు చేయలేదు. అయినా ఎందుకు ఇక్కడికి వచ్చి మమ్ములను అడ్డుకుంటున్నారు?' అని అడిగాం. అధికారులు రెచ్చిపోయారు. విత్తనాలు పెట్టిన పోడు భూములను జేసీబీతో పెకిలించబోయారు. మేం జేసీబీకి అడ్డుగా వెళ్లాం. మాపై దాడులకు పాల్పడ్డారు. పైశాచికంగా ప్రవర్తించారు. మా నైటీలు చించివేశారు. మాలో ఆరుగురం బాలింతలం ఉన్నాం. 'మా చంకల్లో పిల్లలున్నారు. ఆపరేషన్ చేయించుకొని ఉన్నాం. మమ్మల్ని వదిలేయండి. మీ కాళ్లు మొక్కుతాం' అంటూ రెండు చేతులూ జోడించి ప్రాధేయపడ్డాం. అయినా వదల్లేదు. దీంతో మరికొందరు ఆదివాసీ మహిళలు వచ్చి జేసీబీకి అడ్డుగా వెళ్లారు. దీంతో 'ఎందుకొచ్చేరే..' అంటూ అసభ్య పదజాలంతో దూషిస్తూ అటవీ సిబ్బంది మాపై విరుచుకుపడ్డారు. బూటుకాళ్లతో తొక్కారు. చితకబాదారు. ఓ మహిళ చంకలో ఉన్న చంటిబాబు కాలికి గాయం కూడా అయింది' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

### మా దగ్గర 60 వేలు తీసుకున్నరు

'ఆదివాసీ మహిళలమైన మాపై అటవీ శాఖ అధికారులు దాడిచేసినా ఉన్నతాధికారులు బాధ్యులపై ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. మా భర్తలు మాతో పోడు భూమిలో లేని సమయంలో అధికారులు వచ్చి దాడులకు పాల్పడ్డారు. అది వీడియో తీస్తున్న అంగన్‌వాడీ టీచర్‌ను కూడా బెదిరించారు. ఆమె ఫోన్ లాక్కున్నారు. 'ఫోన్‌లో వీడియా తీస్తవా? నీ అంతు చూస్తాం' అంటూ ఆమెను బెదిరించారు. ఈ నెల 20కి మూడు రోజులు ముందు మా గ్రామానికి సిబ్బంది వచ్చారు. 'ఇంటికి రూ.రెండు వేల చొప్పున ఇవ్వండి. మీ గ్రామానికి మేము రాము.' అని చెప్పారు. మొత్తం 30 కుటుంబాల వాళ్లం కలిపి రూ.60 వేలు జమ చేసి ఇచ్చాం. అదేరోజు వారు బీరు బాటిళ్లు తెచ్చుకొని నాటు కోడి కూరతో పార్టీ చేసుకున్నారు. మూడు రోజుల తరువాత మళ్లీ మాపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడి విషయం గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

### సంకలో బాబు ఉన్నా వదల్లేదు



చంటి పిల్లాడిని చంకలో ఎత్తుకొని పోడు భూమికి వెళ్లాం. అప్పుడే మా దగ్గరకు అటవీ అధికారులు వచ్చారు. జేసీబీలతో ఎందుకొచ్చారని అడిగాం. అంతలోనే ఒక అధికారి బూటుకాళ్లతో తన్నాడు. చంకలో ఉన్న బాబును పక్కకుతోసేసి నన్ను తన్నాడు.

-మడకం నందిని, దాడిలో గాయపడిన ఆదివాసీ మహిళ, కోసగుంపు

### చేతులు వెనుకకు విరిచి కొట్టారు



నా రెండు చేతులు వెనుకకు విరిచి మరీ నన్ను కొట్టారు. నా చేతిలో కూడా పిల్లోడు ఉన్నాడు. వాడి చేతిలో ఉన్న ఫోన్ లాక్కున్నారు. వాడిని కూడా పక్కకు తోసేశారు. పిలగాడు ఉరుకుతుంటే వాడికి దెబ్బ తగిలింది. కాలి గోరు ఊడిపోయింది. ఒళ్లంతా నొప్పులు. దవాఖానకు వెళ్లాం.

-కుంజా జోగమ్మ, దాడిలో గాయపడిన ఆదివాసీ మహిళ

### జిప్పతీసి చూపించారు



ఆదివాసీ మహిళలందరమూ అక్కడ ఉండగా ఒక అధికారి తన ప్యాంటు జిప్పు తీసి మాకు చూపించాడు. మేము ఏమీ మాట్లాడకుండా పోడు భూమి వద్ద ఉన్నప్పటికీ మమ్ములను బాగా కొట్టారు. నాకు కొద్దిరోజుల క్రితమే కాన్పు అయిందని, ఆపరేషన్ అయిందని చెప్పినా వినలేదు.

- తాటి లక్ష్మి, దాడిలో గాయపడిన ఆదివాసీ మహిళ

### జేసీబీతో తొక్కించి చంపెటోళ్లు..



మా భూమిలోకి రావద్దంటూ జేసీబీని పట్టుకున్నా. ఒక సారు వచ్చి 'జేసీబీతో తొక్కేయరా' అంటూ డ్రైవర్‌కు చెప్పాడు. డ్రైవర్ వద్దన్నా వినకుండా..'తొక్కించరా?' అంటూ అరిచాడు. దీంతో డ్రైవర్ జేసీబీని ముందుకు కదిలించాడు. నేను తప్పించుకొని బయటపడ్డాను. లేకపోతే నన్ను చంపెటోళ్లు.

- వెట్టి భీమమ్మ, దాడిలో గాయపడిన మహిళ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## అటవీ చట్టాల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

**ఫారెస్ట్ అధికారులతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్**

కాగజ్‌నగర్, జూన్ 23: అటవీ చట్టాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫారెస్ట్ అధికారులుకు సూచించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ రైతులు సాగు చేసుకుంటున్న భూములను దున్నేందుకు వెళ్లగా వారిని అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ సమస్యపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రైతులతో కలిసి కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్‌ను సోమవారం కలిసి మాట్లాడారు. అంకుసాపూర్‌లోని వారంతా నిరుపేద రైతులని, వారు తిండి కోసమే వానకాలంలోనే పంట వేసి బతుకుతారని ఎఫ్‌డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్‌డీవో సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్ ఈఎస్ఐ దవాఖాన, సిర్పూర్‌లోని ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. ప్రభుత్వ దవాఖానలో కరెంట్ లేక రోగులు ఇబ్బంది పడుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు.

# వానమ్మా.. నీ జాడేదమ్మా!

**జూన్ ఆఖరుకొచ్చినా కానరాని వర్షాలు**


**42 శాతం లోటు వర్షపాతం నమోదు**

- నిరుడు ఇదేరోజుకు 114 మిల్లీమీటర్లు
- ఇప్పటికి కురిసింది 56.3 మిల్లీమీటర్లే
- రాష్ట్రంలో 30 జిల్లాల్లో లోటు వర్షపాతం
- 18 జిల్లాల్లో లోటు, 12 జిల్లాల్లో అత్యంత లోటు

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): 'వానమ్మ.. వానమ్మ... ఒక్కసారన్న వచ్చిపోవే...' అంటూ గ్రామీణ ప్రాంతాలు వర్షాల కోసం వేయి కండ్లతో ఆశగా ఎదురుచూస్తున్నాయి. వ్యవసాయ రంగానికి అత్యంత కీలకమైన జూన్‌లో వర్షాలు ముఖం చాటేయడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రతిరోజూ రైతులు మేఘాల వైపు దీనంగా చూస్తున్నారు. వానదేవుడు ఎప్పుడెప్పుడు కరుణిస్తాడా అని ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మే ఆఖరులోనే మురిపించిన నైరుతి రుతుపవనాలు క్రమంగా నెమ్మదించడంతో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురువలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితి నెలకొన్నది. జూన్‌లో ఇప్పటివరకు (23వ తేదీ) సాధారణ వర్షపాతం 97.4 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, 56.3 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే 42% లోటు వర్షపాతం నమోదైంది. నిరుడు జూన్‌తో పోల్చితే ప్రస్తుత పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. నిరుడు జూన్‌లో ఇదే రోజు వరకు 114.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత సంవత్సరం జూన్‌తో పోల్చితే ప్రస్తుతం 51% లోటు వర్షపాతం నమోదుకావడం గమనార్హం.

### 30 జిల్లాల్లో వర్షాలే లేవు

ఈ నెలలో ఇప్పటివరకు మూడు జిల్లాల్లో (మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్) మాత్రమే సాధారణం కంటే స్వల్పంగా ఎక్కువ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని మిగిలిన 30 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఇందులో 18 జిల్లాల్లో లోటు వర్షపాతం, మరో 12 జిల్లాల్లో అత్యంత లోటు వర్షపాతం నమోదైంది. 226 మండలాల్లో లోటు వర్షపాతం, 236 మండలాల్లో అత్యంత లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.






వరుణుడి కటాక్షం కోసం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడులో చిన్నారులు లింగమయ్యకు పశువుల పేడ, మట్టి కలిపి నిండుగా కప్పి పూజలు చేశారు. లింగమయ్య నిండుగా ఉన్న మట్టి, పేడ కరగడానికి వర్షం కురుస్తుందని ప్రజల నమ్మకం (ఫైల్)

**లోటు, అత్యంత లోటు వర్షపాతం నమోదైన జిల్లాలు**

| జిల్లా | లోటు శాతం | జిల్లా | లోటు శాతం |
|---|---|---|---|
| హనుమకొండ | 80 | సిద్దిపేట | 54 |
| సూర్యాపేట | 78 | భద్రాద్రి కొత్తగూడెం | 50 |
| వరంగల్ | 75 | ఖమ్మం | 50 |
| మేడ్చల్ మల్కాజిగిరి | 72 | నారాయణపేట | 37 |
| కరీంనగర్ | 70 | నల్లగొండ | 37 |
| పెద్దపల్లి | 69 | యాదాద్రి భువనగిరి | 36 |
| మహబూబాబాద్ | 69 | కుమ్రంభీం ఆసిఫాబాద్ | 33 |
| రాజన్న సిరిసిల్ల | 68 | నిర్మల్ | 33 |
| హైదరాబాద్ | 68 | ఆదిలాబాద్ | 32 |
| జయశంకర్ భూపాలపల్లి | 65 | జగిత్యాల | 32 |
| జనగామ | 63 | వికారాబాద్ | 31 |
| మంచిర్యాల | 60 | రంగారెడ్డి | 18 |
| ములుగు | 56 | జోగుళాంబ గద్వాల | 15 |
| సంగారెడ్డి | 56 | నిజామాబాద్ | 14 |
| మెదక్ | 54 | కామారెడ్డి | 10 |



నారాయణపేట జిల్లా దంతన్‌పల్లి శివారులో పోలీస్ పహారా మధ్య భూసేకరణ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

## పోలీస్ పహారా మధ్య 'కొడంగల్' భూసేకరణ సర్వే

ఊట్కూర్, జూన్ 23 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ భూసేకరణ సర్వేను అధికారులు పోలీస్ పహారా మధ్య నిర్వహిస్తున్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం దంతన్‌పల్లి శివారులో సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పెద్ద చెరువు సాగునీటి సామర్థ్యం పెంచేందుకు సర్వే కొనసాగించారు. సుమారు 96 ఎకరాల భూమి కోసం తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో ఆర్ఐ కృష్ణారెడ్డి, వెంకటేశ్, అధికారులు సర్వే పూర్తిచేశారు. కాగా ఎకరాకు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు పరిహారం అందజేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# ప్రైవేట్ భూమిలో ఇందిరమ్మ ఇండ్లు!

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో భూమిపూజ
- అడ్డొస్తే చంపేస్తామంటూ కాంగ్రెస్ నేతల బెదిరింపులు?
- మంచిర్యాల జిల్లాలో గిరిజనుల భూమిలో నాయకుల దౌర్జన్యం
- బాధితురాలికి న్యాయం చేస్తామని కలెక్టర్ దీపక్ హామీ



ర్యాలీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాల, జూన్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'రేపు ఎమ్మెల్యే వస్తున్నాడు.. ఈ భూమిలోనే ఇందిరమ్మ ఇండ్ల కోసం శంకుస్థాపన చేస్తాడు. అందుకే భూమిని చదును చేస్తున్నాం. ఇది మీ పట్టా భూమి అయితే మాకేంటి? ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకోండి. మా పనులకు ఎవరైనా అడ్డం వస్తే చంపేయాలని కూడా ఎమ్మెల్యే చెప్పారు' అంటూ కాంగ్రెస్ నేతలు బెదిరించారని మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ గిరిజన మహిళారైతు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నది. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల జిల్లా ర్యాలీ గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు భూమిపూజ చేశారు. ఆ భూమి తమకు వారసత్వంగా వచ్చిందని, పట్టా కూడా ఉందని, బీఆర్ఎస్ హయాంలోనే కాకుండా ఇటీవల కూడా రైతుబంధు వచ్చిందని గిరిజన మహిళారైతు అజ్మీరా లక్ష్మి చెప్తున్నారు. కాంగ్రెస్ నాయకులు భూమిపై వివాదం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవోను పిలిచి వివరాలు అడిగారు. పట్టాభూమిలో ఇండ్లకు శంకుస్థాపన ఎలా చేశారని ప్రశ్నించారు. విచారణ జరిపి నివేదికివ్వాలని ఆదేశించారు. న్యాయం చేస్తామని, భయపడొద్దని భరోసా కల్పించారు.

### అడ్డొస్తే చంపేయాలని చెప్పారు!

గ్రామంలోని సర్వే నంబర్ 129/ఆ/2 బీలో రెండు ఎకరాల రెండు గుంటల భూమి ఉంది. తన భర్త అజ్మీరా చందుకు వారసత్వంగా వచ్చిందని లక్ష్మి చెప్తున్నారు. ఇందులో ఎకరం భూమిని ఆదివారం మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భర్త పవ్యావుల ముని చదును చేయించారని తెలిపారు. మునికి ఫోన్ చేసి భూమి ఎందుకు దున్నుతున్నారని అడిగామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తారని, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చెప్పినందుకే చదును చేస్తున్నామని, అడ్డొస్తే చంపేయాలని ముని తెలిపారని చెప్పారు. హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కోర్టుకు వెళ్లి తేల్చుకోవాలని చెప్పినట్టు వాపోయారు. ఎమ్మెల్యేను కలిసేందుకు ప్రయత్నించగా నిరాకరించారని చెప్పారు.

# బిల్లు మంజూరుకు 15వేలు లంచం

- ఏసీబీకి పట్టుబడ్డ అంబర్‌పేట సర్కిల్ ఏఈ



పట్టుబడ్డ ఏఈ మనీషా

అంబర్ పేట, జూన్ 23: జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16, వార్డు-2 అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న టీ మనీషా బిల్లు మంజూరు చేయడానికి కాంట్రాక్టర్ వద్ద రూ.15000 లంచం డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు ఏసీబీ హైదరాబాద్ రేంజ్-1 యూనిట్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం కాంట్రాక్టర్ ఏఈ మనీషాకు రూ.5వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈ మనీషాపై కేసు నమోదు చేసి, కోర్టులో రిమాండ్ చేశారు. కాగా, ఏఈ మనీషా ఇప్పటికే ఒకసారి ఏసీబీ అధికారులకు పట్టుబడటం గమనార్హం.

## శ్రీధర్ బ్యాంకు లాకర్లలో 5కోట్ల నగదు, ఆభరణాలు!

హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే కేసులో అరెస్టు అయిన కాళేశ్వరం ఈఈ నూనె శ్రీధర్ బ్యాంకు లాకర్లలో రూ.5 కోట్ల నగదు, బంగారం, వెండి, వజ్రాలతో కూడిన ఆభరణాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. నూనె శ్రీధర్‌ను సోమవారం విచారించిన ఏసీబీ అధికారులు పలు విషయాలు రాబట్టారు. నిరుడు ఏసీబీ దాడుల్లో నూనె శ్రీధర్ వద్ద 100 కోట్ల విలువైన ఆస్తులను అధికారులు గుర్తించారు.

# ప్లాట్ల వేలంతో రూ.65 కోట్ల ఆదాయం

- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం వెల్లడి

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డు భూములు మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయి. వివిధ ప్రాంతాల్లోని ఇంటి స్థలాలు (ప్లాట్లు), కమర్షియల్ స్థలాలు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు కలిపి 11 ఆస్తులకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించడంతో రూ.65.02 కోట్ల ఆదాయం సమకూరినట్టు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ శాఖ కమిషనర్ వీపీ గౌతం వెల్లడించారు. గచ్చిబౌలిలోని 3,271 చదరపు గజాలు, చింతల్‌లోని 799.98 చదరపు గజాల స్థలాలతోపాటు నిజాంపేటలో 1,653 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఫ్లాట్లకు కేపీహెచ్‌బీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన వేలంలో 55 మంది పాల్గొన్నట్టు తెలిపారు. గచ్చిబౌలిలోని ఓ కమర్షియల్ ప్లాట్ రూ.33 కోట్లు, మరో చోట ఇంకో ప్లాట్ రూ.13.51 కోట్లు, రెండు ఎంఐజీ ప్లాట్లు దాదాపు రూ.4.50 కోట్ల ధర పలికినట్టు వివరించారు.

### వేలం వేసిన స్థలాలు

గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలోని 1,487 గజాల కమర్షియల్ ల్యాండ్‌ను చదరపు గజానికి రూ.2.22 లక్షలు చొప్పున వెచ్చించి రూ.33 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ స్థలం ఆఫ్ సెట్ ధరను చదరపు గజానికి రూ.1.20 లక్షలుగా నిర్ణయించగా వేలంలో అది రూ.2.22 లక్షలు పలకడం విశేషం.

- గచ్చిబౌలిలోని మరో 1,200 గజాల పాఠశాల భూముల ఆఫ్ సెట్ ధరను చదరపు గజానికి రూ.80 వేలుగా నిర్ధారించగా.. వేలంలో రూ.1.12 లక్షలకు కొనుగోలు చేశారు.
- గచ్చిబౌలిలోనే మరో 2 ఎంఐజీ ప్లాట్లు వరుసగా చదరపు గజం రూ.1.86 లక్షలు, రూ.1.32 లక్షల ధర పలికాయి. దీంతో ఒక్క గచ్చిబౌలి ప్రాంతంలోని స్థలాల వేలం ద్వారానే హౌజింగ్ బోర్డుకు దాదాపు రూ.55.57 కోట్ల ఆదాయం సమకూరింది.
- కుత్బుల్లాపూర్ మండలంలోని చింతల్ ప్రాంతంలో 10 ప్లాట్లను వేలం వేశారు. వాటిలో కేవలం మూడు (నంబర్ 113, 114, 115) ప్లాట్ల ద్వారానే సుమారు రూ.8.11 కోట్ల ఆదాయం వచ్చింది.
- నిజాంపేట-బాచుపల్లిలోని 4 ప్లాట్లను వేలంలో దాదాపు రూ.70 లక్షలకు కొనుగోలు చేశారు.